క్లుప్తంగా

పంట కోత ప్రయోగం


ప్రయోగం నిర్వహిస్తున్న ఏఈవో, రైతులు

నెన్నెల: మండలంలోని కోణంపేట గ్రామ శివారులో మంగళవారం వరిలో పంటకోత ప్రయోగం నిర్వహించినట్లు ఏఈఓ రాంచందర్ తెలిపారు. ఈ ప్రయోగం ద్వారా గ్రామ సాధారణ దిగుబడి అంచనా వేయొచ్చన్నారు. అంచనా వేసిన వివరాలను జిల్లా గణాంకాల అధికారికి పంపించనున్నట్లు తెలిపారు. వరి సరాసరి దిగుబడి నిర్ధారణకు ప్రభుత్వం ఏటా ఈ ప్రయోగాలు కొనసాగిస్తుందని ఏఈఓ వివరించారు. వరి పంట నష్టపరిహారాల చెల్లింపునకు పంట దిగుబడులను పసిగట్టేందుకు ఈ ప్రయోగాలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

భీమారం: మండల కేంద్రంలోని 33 కేవీ విద్యుత్తు సబ్‌స్టేషన్ అదనపు లైన్ పనుల కారణంగా బుధవారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు మండలంలోని 11గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ కుమారస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

జోనల్‌స్థాయి పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులు

జన్నారం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ పోటీల్లో జన్నారం మండలం స్లేట్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి జోనల్‌స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 4న బెల్లంపల్లిలో నిర్వహించిన జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ పోటీల్లో పాల్గొని అండర్ 14 విభాగంలో అరవింద్, అన్వేష్, దియా, సుప్రీత్‌రెడ్డి, రిషిత్‌లు అండర్ 17 విభాగంలో కార్తిక్, సిద్దార్థ్, చారుహాసన్, గణేష్, ప్రణతి, అక్షయలు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం ఏనుగు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

విద్యార్థుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

కాసిపేట: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్, అన్ని యాజమాన్యాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాఠశాలలోని విద్యార్థుల వివరాలు, పాఠశాలలకు కావాల్సిన సౌకర్యాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ సూచించారు. మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్‌స్కూల్లో మంగళవారం మండల స్థాయి యూడైస్ ప్లేస్ పై ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పించారు. వివరాల ఆధారంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కులు, యూనిఫాంలు, ఇతర సౌకర్యాల మంజూరు ఉంటుందన్నారు. సమావేశంలో మండల నోడల్ అధికారి లచ్చయ్య, జెడ్పీ పాఠశాలల హెచ్‌ఎంలు సాంబమూర్తి, రమేష్ రాథోడ్, సుధాకర్, సీసీవో రాంబాబు మండలంలోని ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఏఈవో

చెన్నూర్‌రూరల్: వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మండలంలోని ఒత్కులపల్లి గ్రామంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏఈవో సాగర్ పరిశీలించారు. తుపాను ప్రభావంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు అవగాహన కల్పించారు. అలాగే వరి, పత్తి పంటల్లో పాటించాల్సిన నాణ్యతా ప్రమాణాలపై తెలియజేశారు.

హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు

భీమారం: చెన్నూరు ఎమ్మెల్యేగా కాంగ్రెస్ అభ్యర్థి వివేక్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించినందుకు మంగళవారం మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో కాంగ్రెస్ నాయకులు 516కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. తమ కోరిక తీర్చినందుకు ప్రత్యేక పూజలు నిర్వహించి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నట్లు జెడ్పీటీసీ బుక్యా తిరుమల తెలిపారు. ఇందులో జిల్లా కాంగ్రెస్ నాయకులు పాడేటి రవి, బుక్యా లక్ష్మణ్, కొమ్ము శ్రీనివాస్ పాల్గొన్నారు.

అరకొర వసతులు.. ఆగమాగం పనులు

- అసంపూర్తిగా 'ఓపెన్ జిమ్'..
- మొదలుకాని చిల్డ్రన్ పార్కు పనులు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- రూ.75 లక్షలు కేటాయించిన అధికారులు


ఓపెన్ జిమ్ వద్ద పైకి తేలి ఉన్న కంకర

నస్పూర్: పట్టణ పరిధిలోని 13వ వార్డు న్యూ నాగార్జునా కాలనీలో సింగరేణి స్థలంలో ఏర్పాటు చేసిన చిల్డ్రన్ పార్కు, ఓపెన్ జిమ్ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. షిర్కే, నాగార్జున, న్యూనాగార్జున కాలనీల్లో సింగరేణి కార్మికులు అధికంగా ఉంటారు. న్యూనాగార్జున కాలనీలో సింగరేణికి చెందిన ఖాళీ స్థలంలో క్రీడా మైదానం ఏర్పాటుకు నిర్ణయించారు. క్రీడా మైదానంలోనే చిల్డ్రన్ పార్కు, ఓపెన్ జిమ్‌లు సైతం ఏర్పాటు చేయడానికి అధికారులు చర్యలు చేపట్టారు.

రూ.75లక్షల పట్టణ ప్రగతి నిధులతో...

పట్టణ ప్రగతి నిధుల నుంచి చిల్డ్రన్ పార్కు రూ.50లక్షలు, ఓపెన్ జిమ్ రూ.15లక్షలతో ఏర్పాటుకు అధికారులు నిధులు కేటాయించారు. స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి రెండు నెలల క్రితం ఓపెన్ జిమ్ పరికారాలను బిగించారు. కాలనీలోని యువకులు, మహిళలు అరకొర వసతులతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లో ఇబ్బందులు పడుతూ వ్యాయామం చేస్తున్నారు. ఓపెన్ జిమ్‌లో కేవలం పరికారాలను మాత్రమే బిగించి, అందులో గ్రీనరీని, లైటింగ్‌ని ఏర్పాటు చేయకపోవడంతో ఓపెన్ జిమ్‌లో వ్యాయామానికి వచ్చేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రీనరీ ఏర్పాటుకు నేలను కొంత మేర తవ్వి కంకర వేశారు. ఆ కంకర మొత్తం పైకి తేలి వ్యాయామానికి వచ్చే వారి కాళ్లకు గుచ్చుకోవడంతో మరింత ఇబ్బందులు పడుతున్నారు.

మొదలు కాని చిల్డ్రన్ పార్కు పనులు...

శ్రీరాంపూర్ ఏరియాలోనే నస్పూర్, షిర్కే, నాగార్జునా, న్యూ నాగార్జున కాలనీలు పెద్దవి. ఇక్కడ కార్మిక కుటుంబాలు అధికంగా ఉంటాయి. చిల్డ్రన్ పార్కు ఏర్పాటైతే కార్మిక కుటుంబాలు సాయంత్రం వేళలో సేద తీరడానికి, పిల్లలు ఆడుకోవడానికి ఉపయోగకరంగా ఉంటుంది. చిల్డ్రన్ పార్కు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తే ప్రజలు వాకింగ్ చేసుకోవడానికి సైతం ఉపయోగపడుతుంది. అధికారుల నిర్లక్ష్యం మూలంగా చిల్డ్రన్ పార్కు, ఓపెన్ జిమ్ పనులు పూర్తి కాలేదని పలువురు కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి చిల్డ్రన్ పార్క్ ఓపెన్ జిమ్ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

అనుమతులు రావాలి

న్యూ నాగార్జున కాలనీలోని సింగరేణి స్థలంలో క్రీడా మైదానం, చిల్డ్రన్ పార్కు, ఓపెన్ జిమ్‌లు ఏర్పాటుకు మొదట సింగరేణి అధికారులు మౌఖికంగా అనుమతులు ఇచ్చారు. స్థలం చుట్టూ మేము ఫెన్సింగ్ ఏర్పాటు చేసి పనులు మొదలు పెట్టాం. మళ్లీ సింగరేణి అధికారులు తమ సంస్థకు చెందిన స్థలంలో క్రీడా మైదానం, చిల్డ్రన్ పార్కు, ఓపెన్ జిమ్ ఏర్పాటుకు అనుమతులు లేవని అన్నారు. తమ ఉన్నతాధికారులతో మాట్లాడి తదనంతరం అనుమతులు ఇస్తామని తెలిపారు. దీంతో పనులు అర్ధంతరంగా నిలిపివేశాం. సమస్యను త్వరలో సింగరేణి అధికారులు, ప్రభుత్వ ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేయిస్తాం.

– తన్నీరు రమేశ్, మున్సిపల్ కమిషనర్



పొంచి ఉన్న ప్రమాదం



భీమారం: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి ఎలకేశ్వరం వరకు ఏర్పాటు చేసిన 11కేవీ విద్యుత్ లైన్ స్తంభాలు పలు చోట్ల ప్రమాదకరంగా ఉన్నా విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. భీమారం సబ్‌స్టేషన్ నుంచి గ్రామాలకు మెరుగైన విద్యుత్ సరఫరా చేసేందుకు విద్యుత్‌శాఖ ఎలకేశ్వరం ఫీడర్ పేరుతో లైన్ ఏర్పాటు చేశారే తప్పా, విద్యుత్ స్తంభాలు సక్రమంగా ఏర్పాటు చేశారా లేదా అనేది పట్టించుకోలేదని రైతులు పేర్కొన్నారు. దాదాపు ఆరు కిలోమీటర్ల మేరా విద్యుత్ లైన్ వేసినా, నల్లమట్టితో ఉన్న భూముల్లో, సిమెంట్ కాంక్రీట్ వేసి పూడ్చాల్సి ఉండగా అలా చేయకుండా గోతిలో స్తంభం పెట్టి మట్టి నింపారని ఆరోపించారు. దీంతో స్తంభాలు ఒక వైపు వంగిపోయాయని వాపోయారు. పడిపోకముందే అధికారులు పట్టించుకోవాలని పలువురు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

తాండూర్: మండలంలో బుధవారం మండల స్థాయి విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు తాండూర్ ఏ.ఈ ప్రభాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాండూర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం నుంచి పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు, విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ వేదికలో నిజామాబాద్ సీజీఆర్ఎఫ్ అధికారులు, బెల్లంపల్లి డీ.ఈ రాజన్న, ఏ.డీ శ్రీనివాస్, ఇతర అధికారులు హాజరవుతారన్నారు. బెల్లంపల్లి, తాండూర్, కాసిపేట మండలాల ప్రజలు పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

8న అయ్యప్ప మండల పడిపూజ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: ఈ నెల 8న శ్రీరాంపూర్ ప్రగతి మైదానంలోని అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మండల పడిపూజ కార్యక్రమం జరగనుందని స్వాములు తెలిపారు. మంగళవారం దీనికి సంబంధించిన పోస్టర్‌ను శ్రీరాంపూర్ కార్యాలయంలో జీఎం సంజీవరెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రచార సభ ఏరియా అధ్యక్షుడు బొడ్డు లక్ష్మణ్ మాట్లాడుతూ.. కేరళకు చెందిన సంజీవనం బూద్రి గురుస్వామి ఆధ్వర్యంలో సాయంత్రం 6గంటలకు పడిపూజ కార్యక్రమం జరుగుతుందన్నారు. అనంతరం స్వాములతో అగ్ని గుండాల ప్రవేశ కార్యక్రమం కూడా ఉంటుందన్నారు. మధ్యాహ్నం స్వాములకు బిక్ష కార్యక్రమం కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి భక్తులు, స్వాములు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో ప్రచార సభ ఏరియా ప్రధాన కార్యదర్శి భాస్కర్ రాజేశం, ఉపాధ్యక్షులు మెడవేణి చందర్, వంగ శివకుమార్‌తో పాటు సురేందర్, ఐలయ్య హరీష్, శ్రావణ్, పుట్ట, రవి, ప్రసాద్, రమేష్, సిద్ధార్థ, దాసరి నవీన్, వేణు తదితరులు పాల్గొన్నారు.

పీఎస్సార్‌ను ఆదరించిన ప్రజలకు కృతజ్ఞతలు


మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

మంచిర్యాలటౌన్: నియోజకవర్గం ప్రజలు కొక్కిరాల ప్రేంసాగర్‌రావు చేసిన సేవలను గుర్తించి, ఆయన్ను భారీ మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిపించారని, ప్రజల ఆశయాలకు అనుగుణంగా ఆయన్ను మంత్రిగా చేస్తారనే ఆశాభావాన్ని మంచిర్యాల కాంగ్రెస్ నాయకులు వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని కొక్కిరాల ప్రేంసాగర్‌రావు నివాసంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మంచిర్యాల నియోజకవర్గం ప్రజలు ఆశీర్వదించడం వల్ల భారీ మెజార్టీతో పీఎస్సార్ గెలుపొందారని, ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం నియోజకవర్గాన్ని తప్పకుండా అభివృద్ధి చేస్తారని తెలిపారు. అన్ని మండలాల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అత్యధికంగా మెజార్టీని కట్టబెట్టిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, మున్సిపల్ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ సంజీవ్, నాయకులు పాల్గొన్నారు.

13 నుంచి గీతా జయంతి ఉత్సవాలు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

శ్రీరాంపూర్: ఈ నెల 13 నుంచి 23వ తేదీ వరకు గీతా జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు శ్రీమత్ భగవద్గీత సత్సంగ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు గురూజీ దాసరి రాజేశం తెలిపారు. శ్రీరాంపూర్‌లోని కృష్ణ కాలనీ శివాలయం ప్రాంగణంలోని గీతా ప్రశాంతి నిలయంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆలయ రజితోత్సవ కార్యక్రమంలో భాగంగా నిత్యం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 13నుంచి మొదలై 23వరకు జరుగుతాయన్నారు. 13నుంచి 19వరకు గీతా జ్ఞాన సప్తాహం, 20న భక్తుల కోలాటాలు, భజనలతో పురవీధుల్లో శోభాయాత్ర, 21న శ్రీమూర్తులతో లక్ష్మీ పూజలు, 22న గీతాహవన యజ్ఞాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి ప్రసాద్ రావుతోపాటు రాజమౌళి, లక్ష్మీనారాయణ, ఆరు మల్లేష్, ఎం.సారయ్య, సమ్మయ్య, మనోహర్ లక్ష్మి, పద్మ పాల్గొన్నారు.

బస్సు రాదు.. అవస్థలు తీరవు

- స్కూల్ బస్సులను ఏర్పాటు చేయని కంపెనీ
- ఫీజులు మాత్రం ముందే వసూలు..
- ఇబ్బంది పడుతున్న సింగరేణి విద్యార్థులు
- 5 నెలలుగా ఆటోలు, సైకిళ్లపై ప్రయాణం


సీసీసీలోని సింగరేణి ఉన్నత పాఠశాల


ఆటోలో వెళ్తున్న విద్యార్థులు

శ్రీరాంపూర్: ఉద్యోగుల సంక్షేమంలో భాగంగా సింగరేణి నెలకొల్పిన విద్యాసంస్థలకు బస్సు సౌకర్యం కరువైంది. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. శ్రీరాంపూర్ డివిజన్ పరిధిలో గల సీసీసీలోని సింగరేణి ఉన్నత పాఠశాల, సింగరేణి పాలిటెక్నిక్ కాలేజీ వంటి రెండు విద్యాసంస్థలు ఉన్నాయి. వీటిలో సింగరేణి ఉద్యోగుల పిల్లలతో పాటు ప్రైవేటు పిల్లలు కూడా చదువుతున్నారు. చుట్టుపక్క కాలనీల నుంచి వచ్చే పిల్లల కోసం కంపెనీ చాలా ఏళ్లుగా బస్సు సౌకర్యం ఏర్పాటు చేస్తుంది. ఐతే ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నెల జూన్ నెలలోనే బస్సులను ఏర్పాటు చేయాల్సి ఉండగా ఇప్పటికి 6నెలలు అవుతున్నా కూడా ఏర్పాటు చేయలేదు. సింగరేణి ఉన్నత పాఠశాలలో 600మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో 180మంది పిల్లలు బస్సుల్లో వచ్చే వారు ఉన్నారు. పాలిటెక్నిక్ కాలేజీలో మొత్తం 900మంది పిల్లలు చదువుతుండగా ఇందులో 120మంది వరకు బస్సుల్లో వచ్చే వారు ఉన్నారు. మంచిర్యాల శ్రీశ్రీనగర్, సీసీసీ కార్నర్, నస్పూర్ కాలనీ, శ్రీరాంపూర్ కాలనీ, కృష్ణాకాలనీ తదితర ప్రాంతాల నుంచి కంపెనీ బస్సులను నడుపుతోంది. ఈ రూట్లలో నిత్యం రెండు బస్సులు నడుపాల్సి ఉంది.

ఫీజులు కూడా చెల్లింపు..

బస్సుల్లో వచ్చే వారు విద్యా సంవత్సరం ప్రారంభంలోనే బస్సు ఫీజు చెల్లించాలి. దూరాన్ని బట్టి సంవత్సరానికి రూ.1000 నుంచి రూ.1400 వరకు వసూలు చేస్తారు. ఈ సంవత్సరం కూడా మొదట్లోనే తల్లిదండ్రుల నుంచి బస్సు ఫీజులు తీసుకున్నా కూడా ఇప్పటికీ బస్సులు ఏర్పాటు చేయలేదని పిల్లల తల్లిదండ్రులు వాపోతున్నారు. దీంతో తాము పిల్లలను పంపించడం ఇబ్బందిగా మారిందని పేర్కొంటున్నారు. ఎన్నిసార్లు అధికారులను అడిగినా కూడా రేపు, మాపు అంటూ కాలం వెళదీస్తున్నారు, కానీ బస్సులు ఏర్పాటు చేయడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బస్సులను సమకూర్చాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

అవస్థలు పడుతున్నాం

మా ఇద్దరు పిల్లలు సింగరేణి పాఠశాలలో చదువుతున్నారు. స్కూల్ ప్రారంభమైన నెలలనే ఇద్దరికి కలిపి రూ.2800 బస్సు ఫీజు చెల్లించాను. కానీ ఇప్పటికీ బస్సు ఏర్పాటు చేయలేదు. దీంతో సీసీసీ కార్నర్ నుంచి నిత్యం ఆటోలో స్కూల్‌కు పంపించాల్సి వస్తుంది. వెంటనే బస్సులను ఏర్పాటు చేయాలి .

- కృష్ణ, సింగరేణి ఉద్యోగి

కాంట్రాక్టర్ జాప్యం వల్లే..

రెండు స్కూల్ బస్సుల కోసం టెండర్ అప్పగించాం. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ బస్సులు నిర్ణీత కాలంలో ఏర్పాటు చేయకుండా జాప్యం చేస్తున్నాడు. దీంతో ఆయన్ను బ్లాక్ లిస్టులో పెట్టి కొత్త టెండర్‌ను పిలిచాం. దీనివల్లే బస్సులు ఏర్పాటు చేయలేకపోయాం. కొత్త టెండర్ పూర్తయ్యి బస్సులు ఏర్పాటు చేయడానికి మరో మూడు నెలలు పట్టొచ్చు.

- చంద్రశేఖర్‌రెడ్డి, ఏరియా ఇంజినీర్

మేదరిపేటలో సంబురాలు


స్వీట్లు పంపిణీ చేస్తున్న మర్రి ప్రవీణారెడ్డి

దండేపల్లి: తెలంగాణ రాష్ట్ర రెండో ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డిని ప్రకటించడంతో పలువురు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దండేపల్లి మండలం మేదరిపేటలో మాజీ జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మర్రి ప్రవీణారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సంబురాలు జరుపుకొన్నారు. టపాసులు పేల్చి, స్వీట్లు పంపిణీ చేసి సందడి చేశారు.

క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించండి

కెరమెరి: క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించాలని హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మీకాంత అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఆశా వర్కర్లకు నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మండలంలో మొత్తం 34వేల జనాభా ఉందని, క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించడంలో వెనుకంజలో ఉన్నామన్నారు. వారం, పది రోజులపాటు దగ్గు తగ్గకుంటే తెమడ పరీక్షలు చేయించాలని పేర్కొన్నారు.

కాంగ్రెస్‌కు జై కొట్టిన పల్లె ఓటర్లు

- ఓటర్లను ఆకట్టుకోవడంలో విఫలమైన చిన్నయ్య

బెల్లంపల్లి: ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించడంలో బెల్లంపల్లి నియోజకవర్గంలోని గ్రామీణ ఓటర్లు కీలకంగా మారారు. కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వినోద్ అభ్యర్థిత్వాన్ని గ్రామీణులు విశ్వసించి భారీ మెజార్టీని సాధించి పెట్టారు. 2018ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి దుర్గం చిన్నయ్య పక్షాన నిలిచిన గ్రామీణ ఓటర్లు ఈ సారి వినోద్‌తో 'చేయి' కలిపారు. ఫలితంగా వినోద్ ప్రత్యర్థి చిన్నయ్యపై 36,878ఓట్ల భారీ ఆధిక్యతతో గెలుపు సాధించారు. బెల్లంపల్లి అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 13మంది అభ్యర్థులు పోటీ చేశారు. వీరిలో వినోద్, చిన్నయ్య మధ్యనే పోటీ కనిపించింది. మిగితా 11మంది అభ్యర్థులు ఓటర్లను అంతగా ప్రభావితం చేయలేకపోయారు. కనీస పోటీ కూడా ఇవ్వడంలో విఫలమయ్యారు. చిన్నయ్య హోరాహోరీగా ప్రచారం చేసినప్పటికీ పల్లె ప్రాంత ఓటర్లు ప్రధానంగా వినోద్ పక్షానే నిలిచారు. చేయిగుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీపై విశ్వాసాన్నీ ప్రదర్శించారు.

అభ్యర్థిత్వం ముందే ఖరారైన..

ఈ సారి ఎన్నికల్లో అభ్యర్థులను బీఆర్ఎస్ పార్టీ ముందస్తుగా ప్రకటించింది. బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రకటించిన నెల రోజుల దాక ఇతర పార్టీల అభ్యర్థులు ఎవరనేది తేలలేదు. బీఆర్ఎస్ అభ్యర్థిగా ఖరారైన చిన్నయ్య అసెంబ్లీ నియోజకవర్గాన్ని కాంగ్రెస్ అభ్యర్థిగా వినోద్ పేరు ప్రకటించే వరకు రెండు సార్లు కలియతిరిగారు. బీఆర్ఎస్ శ్రేణులు, ఓటర్లను కలిశారు. వినోద్ అభ్యర్థిత్వం ఖరారు అయ్యాక మరింత పట్టుదలతో ప్రచారం చేశారు. కానీ ఓటర్ల ఆదరణను చూరగొనడంలో చిన్నయ్య విఫలమయ్యారు. చిన్నయ్య అభ్యర్థిత్వం ముందస్తుగా వెలువడినా, ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలు చిన్నయ్యకు ఓట్లను రాల్చలేకపోయినట్లుగా తెలుస్తోంది. స్థానికేతరుడని వినోద్‌పై ప్రత్యర్థి అభ్యర్థులు ఎన్నిసార్లు, ఏ తీరుగా ప్రచారం చేసినా, ఓటర్ల మనసును దోచుకోలేకపోయారు. పట్టణ, పల్లె ప్రాంత ఓటర్లంతా వినోద్‌కు మద్దతుగా నిలిచి సత్తాచాటారు.

అండగా నిలిచిన ప్రాంతాలు...

అసెంబ్లీ నియోజకవర్గంలో బెల్లంపల్లి మున్సిపాలిటీతో పాటు వేమనపల్లి, భీమిని, కన్నెపల్లి, నెన్నెల, బెల్లంపల్లి, తాండూర్, కాసిపేట మండలాలు ఉన్నాయి. ఆయా మండలాలన్నీ కాంగ్రెస్‌కు అండగా నిలిచాయి. మున్సిపాలిటీలో చిన్నయ్య కన్నా వినోద్‌కు 2శాతం వరకు అదనంగా ఓట్లు వచ్చి ఉంటాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గత ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు అండగా నిలిచిన కాసిపేట మండలం ఈ సారి కాంగ్రెస్‌కు జై కొట్టింది. ఈ మండలంలో వినోద్‌కు దాదాపు 3వేల ఓట్ల మెజార్టీని ఓటర్లు కట్టబెట్టడం విశేషం. బెల్లంపల్లి మండలంలో 2వేల వరకు చేయి గుర్తుకు అధికంగా ఓట్లు రాగా, తాండూర్, భీమిని, కన్నెపల్లి, వేమనపల్లి మండలాల్లోనూ 2వేల పైచిలుకు చొప్పున వినోద్‌కు ఓట్లు వచ్చాయి. చిన్నయ్య సొంత మండలమైన నెన్నెలలోనూ చేయి గుర్తుకు గణనీయమైన ఓట్లు పోలయ్యాయి. గ్రామీణ ఓటర్లు ఆదరించి వినోద్ విజయానికి దోహదపడ్డారు. బీఆర్ఎస్‌కు కంచుకోటలుగా ఉన్న గ్రామీణ ప్రాంతాలన్నీ కాంగ్రెస్‌కు జై అనడంతో చిన్నయ్య ఘోరంగా పరాజయం పాలయ్యారు.

ఘనంగా చర్చి వార్షికోత్సవం


వేడుకల్లో పాల్గొన్న క్రైస్తవ సోదరులు

శ్రీరాంపూర్: కృష్ణాకాలనీలోని సీఎస్ఐ వెస్లీ చర్చి 6వ వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. సోమవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో చర్చి ఫాస్టర్ కే.సురేశ్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రార్థన మందిరం మనకు మనశాంతిని, జ్ఞానాన్ని, మంచి సంబంధాలను నెలకొల్పుతుందన్నారు. ఉత్సాహంగా పాటలు పాడుతూ కార్యక్రమాన్ని జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో స్వప్న సురేశ్, వినయ్‌ప్రశాంత్, అగస్టీన్, ఫిలోమెన్ రాజ్ పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు

కెరమెరి: మండలంలోని రాంగనగర్, కొఠారి, కల్లెగాం, రింగన్‌ఘాట్ ప్రాథమిక పాఠశాలల్లో చదువుకుంటున్న 70 మంది విద్యార్థులకు ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారి అన్నపూర్ణ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు.